క్లుప్తంగా

23న జాబ్ డ్రైవ్



జాబ్ డ్రైవ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డాటాప్రో ప్రతినిధులు

సీతంపేట: డాటాప్రో కంప్యూటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఈ నెల 23న జాబ్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు సంస్థ డైరెక్టర్ రంగినేని సాయిప్రసాద్ తెలిపారు. శంకరమఠం రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యక్రమ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నామని, ఈసారి ప్రభుత్వ సెలవు కారణంగా కార్యక్రమాన్ని నాలుగో శనివారానికి మార్చినట్టు చెప్పారు. సంస్థ కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందని, మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, బెలా మాంక్స్, ఆల్ హాండ్స్ గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, కాన్‌సెంట్రిసిక్స్, టాటా ఎలక్ట్రానిక్స్, తాయో లాబ్స్, సుదర్శిని సొల్యూషన్స్ వంటి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు, యువత, నిరుద్యోగులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సిద్ధవరపు ప్రసాద్, జనరల్ మేనేజర్ కిశోర్ వర్మ, ఎంపీపీ సెంటర్ మేనేజర్ రవి పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు ఆదివారంతో 24వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య పూజలు ప్రారంభించారు. 12 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సహాయ ఇంజినీర్ డీఈఎస్ రామరాజు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, వేదపండితులు ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించండి

మహారాణిపేట: స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీల సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.జె.గణేష్‌కుమార్ కోరారు. ఆదివారం విశాఖలో మునిసిపల్ డైరెక్టర్ పర్సనల్ సెక్రటరీ ఉదయ్ భాస్కర్‌ను సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఎంతో అవగాహన కలిగిన ఉదయ భాస్కర్ మునిసిపల్ డైరెక్టర్ పర్సనల్ సెక్రటరీగా నియమితులు కావడం తమ అదృష్టమన్నారు. ఆయనకు శాలువా కప్పి సన్మానించి, పలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా నాయకులు బి.వి.అశోక్‌కుమార్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

శునకాలను సంరక్షించాలి



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న యువకులు

మద్దిలపాలెం : శునకాల సంరక్షణ కేంద్రాలు ఎక్కడికక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరుతూ మద్దిలపాలెంలోని తెలుగుతల్లి విగ్రహం వద్ద విశాఖ యువత ప్లకార్డులతో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. శునకాల సంరక్షణ బాధ్యతలు మంచిగా చూసే వరకు రోడ్లపై నిరసనలు తెలియజేస్తూనే ఉంటామని నినాదాలు చేశారు. ప్రభుత్వం రక్షణ కల్పించలేనప్పుడు వాటిని స్వేచ్ఛగా బతకనివ్వండని డిమాండ్ చేశారు. ఎక్కడికక్కడ డాగ్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. శంకర్ దేవర, సరోజ, శ్రీను, మణి, ఇషికా, వెంకటేష్ యాదవ్, పవన్, సాయి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

గెడ్డ సరే.. రోడ్డు ఏదీ?

- మాణిక్యాంబ కాలనీవాసులను వేధిస్తున్న రహదారి సమస్య
- వర్షాలకు ప్రమాదకరంగా మారిన వైనం
- రోడ్డును విస్తరించకపోతే గెడ్డ రక్షణ గోడకు నష్టం

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులో ప్రమాదాలకు అడ్డాగా మారిన చాకలి గెడ్డకు ఎట్టకేలకు మోక్షం కలిగినా.. దానికి ఆనుకుని ఉన్న మాణిక్యాంబ కాలనీ వాసులను కొత్త సమస్య వెంటాడుతోంది. మురళీనగర్ పరిసరాల్లో అనేక గెడ్డలు ఉన్నప్పటికీ చాకలి గెడ్డ అత్యంత పొడవైనదిగా చెప్పవచ్చు. ఎన్‌జీజీవోస్ కాలనీ మాధవధార కొండ ఎగువ నుంచి ఈ గెడ్డ ప్రవహిస్తూ జాతీయ రహదారి సమీపంలోని ఊర్వశి కూడలి వద్ద కలుస్తుంది. దీన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయకపోవడం వల్ల దశాబ్దాలుగా మాణిక్యాంబ కాలనీతోపాటు ఇతర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు సహకారంతో వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు కృషి మేరకు రూ.1.89 కోట్ల నిధులతో అభివృద్ధి పనులను ఇటీవలే పూర్తి చేశారు. అయితే గెడ్డ రక్షణ గోడకు ప్రస్తుతం ఉన్న ఇరుకైన సిమెంటు రహదారికి మధ్య గ్యాప్‌ను కలపకపోవడం వల్ల నివాసులు ఇబ్బందులు పడుతున్నారు.

తీరిన గెడ్డ సమస్య

వార్డులోని ప్రమాదకరమైన చాకలి గెడ్డ నుంచి దీని పరిసర ప్రాంతాల నివాసుల రక్షణకు చర్యలు తీసుకున్నారు. గత సమస్యల నుంచి గట్టెక్కేలా ఈ గెడ్డను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశారు. చాకలి గెడ్డ అభివృద్ధికి మంజూరు చేసిన రూ.1.89 కోట్లతో బాటం కాంక్రీటుతోపాటు 220 మీటర్ల పొడవునా రక్షణ గోడ నిర్మించారు. శిథిలమైన గోడ స్థానంలో గెడ్డ బాటం కాంక్రీట్ నుంచి 2.7 మీటర్ల ఎత్తు వరకు రక్షిత గోడ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఇరుకైన సిమెంటు రోడ్డును వెడల్పు చేస్తామని అధికారులు చెప్పినా.. పనులు మొదలు కాలేదు.

రహదారి విస్తరణ సంగతేంటి?

గెడ్డ అభివృద్ధిలో భాగంగా 220 మీటర్లు బాటం కాంక్రీటు వేసి, రక్షణ గోడ నిర్మించినా.. నివాస గృహాలకు, రక్షిత గోడకు మధ్యలో ఉన్న సిమెంటు రహదారి విస్తరణ నేటికీ చేపట్టలేదు. సుమారు 250 మీటర్ల పొడవైన రహదారికి కుడివైపున ఉన్న నివాసులు ఇప్పుడు మరో కొత్త సమస్యను ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రహరీ గోడ నుంచి ప్రస్తుతం ఉన్న సిమెంటు రహదారికి మధ్య ఖాళీ ప్రాంతంలో క్రషర్ బుగ్గి వేసి వదిలేశారు. దీంతో వర్షాలు కురిసేటప్పుడు నీటి ప్రవాహానికి ఇది కొట్టుకుపోయి మార్గం పొడవునా భారీ గొయ్యిలా తయారైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఇది కిందికి దిగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాంతంలోని వాటర్ పైపులు పైకి తేలిపోయాయి. చిన్నపిల్లలు ఇటువైపు రాకపోకలు సాగించే సమయంలో ఈ గోతుల్లో కాలు జారి పడి గాయాల పాలవుతున్నారు. అధికారులను అడిగితే కాంట్రాక్టరు వస్తే రహదారి విస్తరించి కొత్త మార్గాన్ని నిర్మిస్తామని చెబుతున్నట్లు స్థానికులు తెలియజేశారు. రహదారి విస్తరణ జరగకపోతే రక్షణ గోడకు సపోర్టు లేకపోవడం వల్ల కోతకు గురై కూలిపోయే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణం ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



విస్తరించాల్సిన రహదారి ఇదే



పట్టాభిరెడ్డితోట నుంచి మాణిక్యాంబ కాలనీకి వెళ్లే రహదారి



కాంక్రీట్ పనుల అనంతరం చాకలి గెడ్డ



వర్షాలకు కిందికి దిగిపోయిన క్రషర్ బుగ్గి



ప్రమాదకరంగా భారీ గొయ్యి

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదానం చేస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

సీతంపేట: కైట్స్ జూనియర్ కళాశాల, రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ మెట్రో సంయుక్తంగా ఆదివారం శాంతిపురంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్ సభ్యులు, కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులు రక్తదానం చేశారు. 112 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు రవికిరణ్ ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమని, దాతలు దానం చేసే ఒక్కొక్క యూనిట్ రక్తం అత్యవసర సమయాల్లో ఎందరో ప్రాణాలను కాపాడుతుందన్నారు. ఇటువంటి సామాజిక కార్యక్రమాలు భవిష్యత్‌లో మరిన్ని నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.బి.ఎస్.ఎస్.ఎన్.రెడ్డి, ఖజాంచి ప్రశాంతి, ఉపాధ్యక్షురాలు శీలా, కైట్స్ డైరెక్టర్లు కోమినేని కిరణ్ కుమార్, ప్రసాద్, క్లబ్ పూర్వ అధ్యక్షులు సునీత లావణ్య, డాక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

సత్యసాయి ఆధ్యాత్మిక సేవా కేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

మురళీనగర్: మురళీనగర్ వాటర్ ట్యాంకు సమీపంలో సత్యసాయిబాబా ఆధ్యాత్మిక సేవా కేంద్రం నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు శంకుస్థాపన చేశారు. సత్యసాయి సేవా కేంద్రం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని నూతన భవన నిర్మాణానికి భూమిపూజ జరిపారు. సత్యసాయి సేవా కేంద్రం నిర్వహించే కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ 50వ వార్డు అధ్యక్షుడు ఎస్.వరప్రసాద్, జనసేన, బీజేపీ వార్డు నాయకులు, మాధవధార, మురళీనగర్ గ్రామ పెద్దలు, భగవాన్ శ్రీ సత్యసాయి బాబా భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

'సృష్టి గర్భ' పుస్తకావిష్కరణ



గ్రంథ కర్త విజయభాస్కర్‌ను బిరుదుతో సత్కరిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

సీతంపేట: నాటక రచయిత, కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ దీర్ఘాసి విజయభాస్కర్ రచించిన 'సృష్టి గర్భ' (ఉపనిషత్ కాంతి) పుస్తకావిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. శ్రీమాతా కళా పీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఉపనిషత్తులలోని లోతైన భావాలను హృదయానికి హత్తుకునేలా రచయిత పుస్తకంలో పొందుపర్చారన్నారు. ప్రస్తుత ప్రపంచం భారతదేశ సంస్కృతీ సంప్రదాయాల వైపే చూస్తోందని పేర్కొన్నారు. ఇటువంటి రచనలు భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత తెలియజేస్తాయన్నారు. ఈ సందర్భంగా గ్రంథ కర్త విజయభాస్కర్‌కు నాటక రత్న బిరుదును ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. గ్రంథ కర్త మాట్లాడుతూ తీరని ఆధ్యాత్మిక ఆర్తితో సల్పిన సత్యశోధన, నిత్యసాధనలో పొందిన ఆత్మజ్ఞానం, దైవ కృపతో రాసిన గ్రంథమే సృష్టి గర్భ ఉపనిషత్ కాంతి అని తెలిపారు. విజయనగరం మున్సిపల్ కమిషనర్ పల్లి నల్లనయ్య పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలమరశెట్టి ఫ్రాన్సిస్, డాక్టర్ పిల్లుట్ల లక్ష్మీకాంత శర్మ, ప్రవచనకర్త రామకృష్ణానంద్, రచయిత వాడ్రేవు చిన వీరభద్రుడు, వాగ్గేయకారుడు అందెశ్రీ, న్యాయవాది అల్లు కేశవ జోగి నాయుడు, కళాపీఠం అధినేతలు బి.ఎస్.మూర్తి, పల్లి నాగభూషణం పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక



మర్రిపాలెం ఎస్‌ఈ రైల్వే స్కూల్ 1999-2000 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

కంచరపాలెం: మర్రిపాలెం ఎస్‌ఈ రైల్వే ఉన్నత పాఠశాలలో 1999–2000 ఏడాదిలో టెన్త్ చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఆదివారం స్థానిక వుడా కల్యాణ మండపంలో కలుసుకుని సందడి చేశారు. 25 ఏళ్ల నాటి జ్ఞాపకాలు, అనుభవాలను చిన్ననాటి స్నేహితులతో పంచుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. తమ మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. ముందుగా అప్పటి ఉపాధ్యాయులు సావిత్రి, సుశీల, అరుంధతి, ప్రసాదరావు, రమేష్, జయలక్ష్మి, లక్ష్మి, వసంత శ్రీనివాసరావు, లక్ష్మణరావు, మల్లేశ్వరరావు, సుజాత, గురునాథ్, సీతాలక్ష్మి, తులసీరావులను ఘనంగా సత్కరించుకున్నారు. అనంతరం ఆటపాటలు, విందుతో సందడి చేశారు.

మేఘాలే తాకింది హాయ్ హైలెస్సా..





నగరంలో ఆదివారం ఏకధాటిగా రోజంతా కురిసిన వాన ప్రభావంతో విశాఖ పోర్టులో దట్టమైన మేఘాలు కమ్ముకుని కనువిందు చేశాయి. విశాఖ పోర్టు సమీపంలో కొండలు, ఆకాశాన్ని కమ్మిన మేఘాలు చూపరులను ఆకర్షించాయి. నింగిని.. నేలను కలిపేలా కారుమబ్బులు కమ్ముకున్న సుందర దృశ్యాలివి.

- ఫొటోలు: సాక్షి, ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దుర్గాగణపతి నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట నేడు



సీతంపేట: సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయంలో ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక నవరాత్రి మహోత్సవాలకు సోమవారం పందిరి రాట వేయనున్నట్లు అర్చకుడు నటరాజన్ తెలిపారు. రోజుకొక ప్రత్యేక అలంకరణలో ప్రతి రోజూ సాయంత్రం దుర్గగణపతి భక్తులకు దర్శనమిస్తారన్నారు.

కొండవాలులో కూలిన ఇంటి గోడలు



ఏఎస్సార్ నగర్ కొండవాలులో కూలిన ఇంటి గోడలను పరిశీలిస్తున్న అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి అల్లూరి సీతారామరాజునగర్ కొండవాలు ప్రాంతంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రధాన గెడ్డకు ఆనుకుని ఉన్న ఇంటి గోడలు కూలిపోయాయి. ఇంటి రక్షణ గోడలు గెడ్డలోకి కూలడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు తెలియజేశారు. వారి ఫిర్యాదులతో కార్పొరేటర్ గంకల కవిత జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ సంపత్ కుమార్, ఈఈ పద్మావతి, డిప్యూటీ ఈఈ భరణికుమార్‌లతో కలిసి ఆదివారం సంఘటన స్థలానికి చేరుకుని నివాసులతో మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా కొండవాలులో మట్టి పెల్లలు జారే ప్రమాదముండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ కవిత సూచించారు. అధికారులు 24 గంటలూ సహాయక చర్యల్లో ఉంటారని చెప్పారు.

తెరిపివ్వని వాన



అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులో జోరుగా కురుస్తున్న వర్షం

సీతంపేట: మండే ఎండలతో సతమతమవుతున్న జనానికి చల్లటి వాన ఊరటనిచ్చింది. శనివారం రాత్రి నుంచి ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో నగరంలో వాతావరణం పూర్తిగా చల్లబడి ఆహ్లాదంగా మారిపోయింది. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వాన ధాటికి రహదారులు జలమయమయ్యాయి. అక్కయ్యపాలెం, శంకరమఠం రోడ్డులో నీరు నిలిచిపోయి వాహన చోదకులు ఇబ్బందులకు గురయ్యారు. రెండు మూడు అడుగుల ఎత్తు వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. సీతంపేట, శ్రీనివాసనగర్, అబిద్‌నగర్ ప్రాంతాల్లో గెడ్డలు, డ్రెయిన్లలో వాన నీరు ఏరులై పొంగి ప్రవహించింది. గెడ్డలు పొంగడంతో మురుగు నీరు రోడ్డెక్కింది. ఆదివారం సెలవు రోజు కావడంతో బజారు పనిపై బయటకు వచ్చిన వారు రెయిన్ కోట్లు, గొడుగులు పట్టుకుని పనులు చక్కబెట్టుకున్నారు. ఎడతెరపి లేని వర్షం కారణంగా చిరు వ్యాపారులు తమ వ్యాపారాలు సాగక ఉసూరుమన్నారు.



శంకరమఠం రోడ్డులో నిలిచిపోయిన వర్షపు నీటిలో వాహన చోదకుల పాట్లు



వర్షపు నీటిలో స్థానికుల ఇబ్బందులు

ఆక్యుప్రెషర్‌పై ముగిసిన శిక్షణ



మాట్లాడుతున్న సౌమిత్ర దాస్

మద్దిలపాలెం: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో ఈ నెల 12 నుంచి 17 వరకు 5 రోజుల పాటు నిర్వహించిన ఆక్యుప్రెషర్ రిఫ్లెక్సాలజీ శిక్షణ ఆదివారంతో ముగిసింది. ఈ శిక్షణను లాల్ నాయక్ ట్రస్ట్ (విశాఖపట్నం), ఒడిశా స్వాస్థ్య సంఘ్ (కటక్) సంయుక్తంగా నిర్వహించాయి. కటక్ నుంచి ప్రఖ్యాత చికిత్సకుడు సౌమిత్ర దాస్ తన బృందంతో కలిసి పాల్గొన్నారు. శిక్షణలో భాగంగా 37 మందికి రిఫ్లెక్సాలజీ ఆవశ్యకతను నేర్పించారు. చివరగా పరీక్ష నిర్వహించి, విజయం సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో హాజరైన వక్తలు మాట్లాడుతూ పురాతన ఆక్యుప్రెషర్ పద్ధతులు చాలా సరళంగా, ప్రభావవంతంగా పనిచేస్తాయన్నారు. బోధించిన లాల్ నాయక్ ట్రస్ట్, ఒడిశా స్వాస్థ్య సంఘ్ ప్రయత్నాలను ప్రశంసించారు. లాల్ నాయక్ ట్రస్ట్ డైరెక్టర్ రామచంద్ర నాయక్, థెరపిస్ట్ సౌమిత్ర దాస్, రిటైర్డ్ సూపరింటెండెంట్, హెల్త్ మేనేజ్‌మెంట్ ట్రైనర్ వెంకటరావు, మహారాణిపేట బ్రహ్మకుమారీస్ విభాగం అధిపతి సిస్టర్ శివలీల, ఆయుర్వేద రిటైర్డ్ ప్రొఫెసర్ ఈశ్వర్, పతంజలి యోగా శిక్షకుడు రవి పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా ముగిశాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో డాక్టర్ నిష్కించన భక్తిదాస పర్యవేక్షణలో మూడు రోజులుగా వేడుకలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. గాదిరాజు ప్యాలెస్‌లో వేసిన భారీ సెట్‌లో ఆదివారం రాధాకృష్ణులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. బృందావనం నుంచి వచ్చిన లడ్డు గోపాలునికి ఉయ్యాల సేవ నిర్వహించారు. హరేకృష్ణ మూవ్‌మెంట్ వ్యవస్థాపకుడు శ్రీ భక్తివేదాంత స్వామి ప్రభు పాదుల విగ్రహానికి అభిషేకం చేశారు. అనంతరం సంగీత కళాకారులచే సామూహిక భజగోవిందం, హరి నామ జపం నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. ఉదయం 10 నుంచి రాత్రి 9 వరకు భక్తులు భారీగా తరలివచ్చి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.